సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 30.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 218
పేజీలు: 08 వెల: రూ. 5

## ముగిసిన భగీరథ్ కస్టడీ
### చర్లపల్లి జైలుకు తరలింపు



- ఫోక్సో కేసులో కీలక ఆధారాల సేకరణ
- మొయినాబాద్ ఫాంహౌస్ లో సీన్ రీకన్‌స్ట్రక్షన్

03

## జాతీయ రహదారుల నిర్వహణ ప్రైవేట్‌కు

- 17రహదారులతో తాత్కాలిక జాబితా
- రాష్ట్రంలో నుంచి ఎన్ హెచ్ 163

04



# వరికి కేంద్రం బ్రేక్

## ఇక కేంద్రం వంతు
### తెలంగాణలో 25 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గింపు లక్ష్యం
### వరి స్థానంలో పప్పు, నూనెగింజల సాగుకు కేంద్రం ప్రోత్సాహం

- ప్రతి ఏడాది 5 లక్షల ఎకరాల వరి తగ్గించాలని ఆదేశాలు
- వరి రైతులకు పంటల మార్పిడి సవాల్
- ధాన్యం నిల్వల భారం తగ్గించాలన్న కేంద్రం
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించే ప్రయత్నం
- పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపే కేంద్రం లక్ష్యం
- వరి నుంచి వాణిజ్య పంటల వైపు అడుగులు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో అన్నదాతలపై కేంద్రం కత్తి వేలాడదీస్తోంది. సాగునీరు, విద్యుత్ సమృద్ధిగా ఉండటంతో వరిసాగు గణనీయంగా పెరుగుతోంది. వరివైపు రైతులు మళ్లుతున్నారు. దీనికి ప్రభుత్వం కూడా అండగా ఉంటోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇటు రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఇలాంటి సమయంలో కేంద్రం రైతులకు షాక్ ఇచ్చే వార్త చెప్పింది. వరిసాగుపై నియంత్రణ చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం సాగవుతున్న వరిపంటలో ఈ సీజన్ లో 10 శాతం.. అంటే 25 లక్షల ఎకరాల్లో సాగు విస్తర్ణం తగ్గించాలని రాష్ట్రంపై టార్గెట్ పెట్టింది.

**ఓవైపు జలసిరులు..**

తెలంగాణ గడ్డపై పారుతున్న జలకళతో వరి సాగు రికార్డులు సృష్టిస్తుంటే.. కేంద్రం మాత్రం దీనికి కళ్లెం వేసేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా వరి సాగును తగ్గించి, ఆ స్థానంలో నూనెగింజలు, పప్పుధాన్యాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్రం భారీ ప్రణాళికను ప్రకటించింది. రాబోయే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 2.5 కోట్ల ఎకరాల్లో వరి సాగును తగ్గించాలని నిర్ణయించగా, అందులో ఏకంగా 10 శాతం అంటే 25 లక్షల ఎకరాలు బాధ్యతను ఒక్క తెలంగాణకే అప్పగించడం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కలకలం రేపుతోంది.

**తెలంగాణపైనే ఎందుకు ఈ భారం?**

గడిచిన మూడేళ్లలో తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం లక్షల ఎకరాల మేర పెరిగి, ప్రస్తుతం 1.33 కోట్ల ఎకరాలకు చేరుకుంది. ఏటా సుమారు 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. యాంత్రీకరణ పెరగడం, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఉండటంతో పాటు రేవంత్ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ. 500 బోనస్ పథకం రైతులకు వరిపై మరింత మక్కువ పెంచింది. ఫలితంగా కేంద్ర గోదాముల్లో ధాన్యం నిల్వలు నిండిపోయి, కొత్త పంటను నిల్వ చేసేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగానే ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున వరి తగ్గించాలని కేంద్రం చెప్పింది. మిగతా 02లో



## మార్గం.. సుగమం
### హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు లైడార్ సర్వే పూర్తి
### ఉత్తరాన 174.50 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రైలు డీపీఆర్ రూపకల్పనలో అధికారులు నిమగ్నం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కీలక ముందడుగుపడింది. ప్రాజెక్టుకు సంబంధించిన లైడార్ సర్వే పూర్తయ్యింది. దీంతో 174.50 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రైలు ఉత్తర భాగం రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఈ ప్రాజెక్టుకు సంబంధించిన లైడార్ సర్వే పూర్తి కావడంతో.. త్వరలోనే డీపీఆర్‌ను రెడీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఇక ఈ ఉత్తర భాగం కోసం 7657 ఎకరాల భూమిని సేకరించాలని రైల్వే అధికారులు సర్కార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు భూసేకరణకు రూ.6900 కోట్ల వ్యయం కానుండగా.. ఆ మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఈ హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ఉత్తర భాగం డీపీఆర్ (డీటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)ను తయారు చేసేందుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉంది. ఇక రెండో దశలో నిర్మించే రీజినల్ రింగ్ రైల్ దక్షిణ భాగం సర్వేకు మరింత టైమ్ పట్టనుంది. దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ ఖరారు చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. దాని ఆమోదం కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే సర్వే మొదలు కానుందని రైల్వే అధికారులు వెల్లడించారు. దక్షిణ భాగం రింగ్ రైలు డీపీఆర్‌కు 2026 జూన్ తుది గడువుగా మొదట నిర్ణయించగా.. అసలు సర్వే ప్రారంభం కాకపోవడంతో దాని డీపీఆర్ మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. మిగతా 02లో

## జగిత్యాలలో పోస్టర్ల లొల్లి..

- బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ సేవాదళ్ పేరుతో వెలిసిన పోస్టర్
- కౌంటర్ గా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు పోస్టర్లు అంటించిన బీజేపీ నాయకులు
- సేవాదళ్ నాయకుల హౌస్ అరెస్ట్
- హాట్ టాపిక్ గా జగిత్యాల రాజకీయాలు

03




## సెక్స్ వర్కర్లుగా మారడం నేరం కాదు
### పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలి



- వారికి ఆధార్ కార్డులు జారీ చేయాలి
- తీర్పుల ఆలస్యంపైనా సుప్రీంలో విచారణ
- వాదనలు ముగిసిన మూడు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని ఆదేశం
- హైకోర్టులలో జరుగుతున్న ఆలస్యంపై ఆగ్రహం
- బెయిల్ తీర్పులు ఒక్క రోజులోనే జడ్జిమెంట్
- స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూష న్ కు చేసే వారిని వేధించవద్దు
- మానవ అక్రమ రవాణపై సుప్రీం మార్గదర్శకాలు విడుదల
- పోలీసులు, మీడియాకు కీలక సూచనలు చేసిన న్యాయస్థానం

04

## వానలే వానలు..
### ఈసారి జోరు ఎండలు... అలాగే జోరు వానలు

- నైరుతి రుతుపవనాలపై ఐఎండీ అంచనా
- తెలుగు రాష్ట్రాలకు వర్షా ల జోష్
- రైతులకు వరం కానున్న రుతుపవనాలు
- హైదరాబాద్‌లో భారీ వర్ష సూచనలు
- సూపర్ ఎల్‌నినోపై ఐఎండీ హెచ్చరిక
- సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మాడుపగులుతోన్న ఎండలు, అకాల వర్షాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించి ఐఎండీ శుక్రవారం తన తుది దీర్ఘకాలిక మిగతా 02లో

## ధాన్యం కొనుగోళ్లలోను తెలంగాణ రికార్డ్
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- యావత్ భారత దేశంలోనే తెలంగాణ వాటా 60శాతం

03





## ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి
- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

04

### 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు

## రైతు డిస్కం
### అధికారిక లోగో రిలీజ్
### జూన్ 2 నుంచి పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభం

**ముద్ర, తెలంగాణ. బ్యూరో :** రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి నాణ్యమైన సేవలందించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటైన రైతు డిస్కం సేవలు జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుంచి పూర్తి స్థాయి సిబ్బందితో అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సంస్థకు సంబంధించిన అధికారిక లోగోను మిగతా 02లో





## రిటైర్డ్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్
### రూ.2,000 కోట్లతో ఊరట

03

- బకాయిల విడుదలకు శ్రీకారం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్కార్
- 100 రోజుల్లో రూ.6,000 కోట్ల లక్ష్యం
- వంద రోజుల్లో రూ. 6వేల కోట్లు విడుదల చేస్తామన్న డిప్యూటీ సీఎం



ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 30.05.2026
www.mudranews.in | @mudranews



## అశ్వగంధతో : శృంగార వాంఛ,



లైంగిక పటుత్వం పెంపుశుద్ధి చేసిన అశ్వగంధను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పురుషులలో టెస్టోస్టిరాన్ హార్మోన్ స్థాయిలు మెరుగుపడతాయి. ఇది లైంగిక సామర్థ్యాన్ని, వాంఛను పెంచడానికి మరియు వృద్ధాప్యంలో వచ్చే బలహీనతను తగ్గించడానికి అద్భుతంగా తోడ్పడుతుంది.

# వానలే వానలు..



(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ అంచనాలను విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌తో కూడిన మధ్య తెలంగాణ ప్రాంతాల్లో ఈసారి భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య కోస్తా ప్రాంతాల్లో కూడా రుతుపవనాల ప్రభావం అనుకూలంగా ఉండనుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ వర్షాలు ఉభయ రాష్ట్రాల్లోని వ్యవసాయ రంగానికి, తాగునీరు, భూగర్భ జల వనరుల పునరుద్ధరణకు ఎంతో ఊరటనిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

**'సూపర్ ఎల్ నినో'పై ఆందోళన**

తెలుగు రాష్ట్రాలకు సానుకూల అంచనాలు ఉన్నప్పటికీ, దేశవ్యాప్త పరిస్థితి మాత్రం కొంత ఆందోళనకరంగానే ఉండేలా కనిపిస్తున్నట్లు ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్ నినో' ప్రభావం కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణ పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా, లభించే ప్రతి నీటి చుక్కను ఆచితూచి, పొదుపుగా వాడుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

# వరికి కేంద్రం బ్రేక్



(మొదటి పేజీ తరువాయి)

**ధాన్యం ఎక్కువ**

రాష్ట్రంలో ఒకవైపు వరి నిల్వలు పేరుకుపోతుంటే, మరోవైపు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మన అవసరాలకు సరిపడా ఇవి ఇక్కడ ఉత్పత్తి కాకపోవడంతో మహారాష్ట్ర, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. అందుకే వరిని తగ్గించి, ఆ భూముల్లో ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు , వాణిజ్య పంటలు వేయడం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించవచ్చని కేంద్రం సూచిస్తోంది.

**రైతులకు సవాల్‌గా మారనున్న పంటల మార్పిడి**

అయితే, దశాబ్దాలుగా వరి సాగుకే అలవాటు పడిన రైతులకు ఇది పెద్ద పరీక్షగా మారనుంది. వరి పంటకు ఉన్న మార్కెటింగ్ సౌకర్యం, నీటి లభ్యత ఇతర పంటలకు ఉంటుందా? అన్నది రైతుల ప్రధాన సందేహం. కేవలం ఆదేశాలతోనే వరి సాగు తగ్గదని, ప్రత్యామ్నాయ పంటలకు గ్యారెంటీ ధర స కొనుగోలు భరోసా కల్పిస్తేనే ఈ లక్ష్యం సాధ్యమవుతుందని వ్యవసాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేంద్రం నిర్దేశించిన ఈ భారీ టార్గెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. వరి తగ్గించి ఇతర పంటల వైపు రైతులను మళ్లించడం వల్ల మార్కెట్‌లో సమతుల్యత వస్తుందని ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులను ఒప్పించడం అంత సులభం కాకపోవచ్చు. ఏదేమైనా, తెలంగాణ వ్యవసాయం ఇప్పుడు వరి నీడ నుంచి బయటకు వచ్చి వాణిజ్య బాట పట్టాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

## జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ శిక్షణకు
# ఐఈఐ-ఏజీఐఎల్ఈ ఒప్పందం

**ముద్ర , హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో శుక్రవారం ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (IEI), జపాన్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ జియో ఇన్ఫర్మాటిక్స్ లాబొరేటరీస్ ఫర్ ఎర్త్ సైన్సెస్ (AGILE) మధ్య కీలక అవగాహన ఒప్పం దం (MoU) కుదిరింది. జీఐఎస్ (GIS), రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ టెక్నాలజీలలో భారత యువతకు అధునాతన శిక్షణ అందించడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఐఈఐ అధ్యక్షుడు మనీష్ మహేంద్ర కొఠారి మాట్లాడుతూ, 106 ఏళ్ల చరిత్ర కలిగిన తమ సంస్థ ద్వారా ఇప్పటికే లక్షలాది మంది ఇంజనీర్లు శిక్షణ పొందారని తెలిపారు. భారతదేశంలో వ్యవసాయం, అటవీ సంరక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో రిమోట్ సెన్సింగ్ సాంకేతికతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కేంద్ర



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో జరిగిన చర్చల నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఈ ఒప్పంద పత్రాలపై ఐఈఐ సెక్రటరీ అండ్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ మోహన్ జీత్ సింగ్ సయాలి, ఏజీఐఎల్ఈ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ రాఘవన్ సంతకాలు చేశారు. డాక్టర్ రాఘవన్ మాట్లాడుతూ, జ్ఞాన భాగస్వామ్యం, ఆవిష్కరణలకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని, భారతదేశంలో జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు దేశ సాంకేతిక అభివృద్ధికి తోడ్పడతాయని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఈ కీలక ఒప్పందం కుదరడం గర్వకారణమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు తెలిపారు.

# మార్గం.. సుగమం



(మొదటి పేజీ తరువాయి)

ఇక ఈ హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు సర్వేకు 2023 జూన్ 21వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఆ తర్వాత రంగంలోకి దిగిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు సర్వే చేసి ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్డుకు కొన్ని ప్రాంతాల్లో పక్క నుంచి.. మరికొన్ని ప్రాంతాల్లో కొంత దూరం నుంచి రింగ్ రైలు ఎలైన్‌మెంట్ ఉండటంతో.. ఈ 2 ప్రాజెక్టులకు, 2 సార్లు భూసేకరణ చేయడం కష్టమవుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కలిసి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు ఆనుకుని.. రీజినల్ రింగ్ రైలు ఎలైన్‌మెంట్‌ను మార్చాలని కోరడంతో.. పాత ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు.

రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం ఎలైన్‌మెంట్‌ను సంగారెడ్డి పక్కనే ఉన్న గిర్మాపూర్ నుంచి చౌటుప్పల్ సమీపంలోని తంగడపల్లి వరకు అధికారులు ఖరారు చేశారు. ఈ రీజినల్ రింగ్ రైల్ ఉత్తర భాగం ఎలైన్‌మెంట్ కూడా దాదాపు ఇదే మార్గంలో ఉంటుంది. మధ్యలో మాసాయిపేట, అప్పాయిపల్లి, రాయగిరి రైల్వేస్టేషన్ ప్రాంతాల మీదుగా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. రైల్వే శాఖ గతంలో తయారు చేసిన ఎలైన్‌మెంట్ ప్రకారం ఉత్తరం, దక్షిణం కలిపి మొత్తం 392 కిలోమీటర్ల మేర ఉండనుంది. తాజా సవరణలతో కాస్త తగ్గే అవకాశాలు ఉన్నాయి.

# రైతు డిస్కం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. అందులో సౌర, జల, పవన విద్యుత్‌కు సంబంధించి చిహ్నాలు ఉన్నాయి. బ్యాక్‌గ్రౌండ్‌లో పంట సాగు దృశ్యం ఉంది. ఈ రైతు డిస్కంకు సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న దక్షిణ, ఉత్తర డిస్కంల పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి ఈ సరికొత్త ప్రత్యేక డిస్కంను ఏర్పాటు చేశారు. గత ఐదేళ్ల విద్యుత్ వినియోగ గణాంకాలను పరిశీలించిన ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన రైతు డిస్కానికి అత్యధికంగా 42 శాతం వాటాను కేటాయించింది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల ఖచ్చితమైన వివరాలు, వాటి లొకేషన్లను డిజిటల్ రూపంలో సేకరించేందుకు రైతు డిస్కం ఓ ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వేను అధికారులు మరింత ముమ్మరం చేశారు.




# వైభవ్‌ను వెంటాడుతున్న దురదృష్టం..

**ముద్ర డెస్క్ :**

వైభవ్ సూర్య వంశీ వయసు 15 సంవత్సరాలు మాత్రమే. కానీ అతడు ఆడుతున్న తీరు చూస్తుంటే మాత్రం సంవత్సరాల అనుభవం ఉన్న ఆటగాడి కంటే ఎక్కువ కనిపిస్తోంది. బంతిని కొట్టే విధానంలో.. వికెట్ కాపాడుకునే విధానంలో అతను చూపిస్తున్న మెచ్యూరిటీ అద్భుతంగా ఉంది. ముఖ్యంగా జట్టులో పెద్దపెద్ద ప్లేయర్లు సైతం చేతులెత్తేస్తున్న వేళ.. అతడు ఆడుతున్న తీరు గొప్పగా ఉంది.

అతడి ఆట తీరు అంత అద్భుతంగా ఉంది కాబట్టి గొప్ప గొప్ప ప్లేయర్లు అతడిని కొనియాడుతున్నారు. సూపర్ బ్యాటింగ్ అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇతడి చేతిలో భారత జట్టు అత్యంత భద్రంగా ఉంటుందని.. టీమిండియాకు భవిష్యత్తు ఇతడేనని వ్యాఖ్యానిస్తున్నారు. ఐపీఎల్ లో ఈ సీజన్లో ఇప్పటి వరకు పరుగుల వరద పారిస్తూ.. ఆరెంజ్ క్యాప్ హోల్డర్ గా కొనసాగుతున్నాడు సూర్యవంశీ. రాజస్థాన్ జట్టుకు బ్యాటింగ్ విభాగంలో వెన్నెముక మాదిరిగా నిలుస్తున్నాడు. జట్టుకు అవసరమైన ప్రతి సంద ర్భంలో ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తూ సత్తా చూపిస్తున్నాడు. వైభవ్ సూర్య వంశీ ఆట తీరు గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అతడు చూపించే దూకుడుకు కొత్తగా ఉపమానాలు అల్లాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే అతడు బ్యాటింగ్ చేస్తున్న తీరు అమోఘం. బంతులను కొడుతున్న తీరు అత్యద్భుతం. వీరోచితమైన బ్యాటింగ్ తో అతడు చూపిస్తున్న తెగువ అనితర సాధ్యం. ఇన్ని సానుకూలతలు ఉన్నప్పటికీ.. సూర్య వంశీ కి ఒక విషయంలో మాత్రం ప్రత్యేక ఇబ్బంది ఎదురవుతోంది. అదే సెంచరీల ముందు అతడు అవుట్ కావడం..

ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా మూడుసార్లు సెంచరీల ముందు సూర్య వంశీ అవుట్ అయ్యాడు.. అతడు అలా అవుట్ కావడం అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఈ సీజన్లో ఇప్పటివరకు అతడు మూడుసార్లు సెంచరీల ముందు అవుట్ అయ్యాడు. లీగ్ దశలో 93 పరుగుల వద్ద ఒకసారి అవుట్ అయ్యాడు. ఎలిమినేటర్ మ్యాచ్లో 97 పరుగుల వద్ద మరొకసారి ఒకటి అయ్యాడు. క్వాలిఫైయర్ టు మ్యాచ్ లో 96 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు.

ఒకవేళ ఈ మూడు సార్లు అతడు అవ్వకుండా ఉండి ఉంటే.. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఆటగాడిగా అతడు రికార్డు సృష్టించేవాడు. అంతే కాదు, అన్ క్యాప్డ్ ఆటగాడిగా ఈ స్థాయిలో పరుగులు సృష్టించిన ప్లేయర్ గా అతడు రికార్డు నెలకొల్పేవాడు. సూర్య వంశీ ఇలా మూడుసార్లు అవుట్ కావడం పట్ల అతడి అభిమానులు, రాజస్థాన్ యాజమాన్యం తీవ్ర నిర్వేదం వ్యక్తం చేస్తోంది.

# కర్ణాటక పంచాయతీ సెటిల్..

**ముద్ర డెస్క్ :**

కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో అధికార పక్షంలో ఒక భాగమైంది. కీలకమైన పశ్చిమ బెంగాల్లో.. అస్సాంలో.. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. కనీసం చెప్పుకునే స్థాయిలో శాసన సభ స్థానాలను దక్కించుకోలేకపోయింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇప్పుడు వచ్చే వాళ్ళతో.. పోయే వాళ్లతో అత్యంత రద్దీగా ఉంది. రాహుల్ గాంధీ కూడా మల్లికార్జున కార్గే.. వేణుగోపాల్ రెడ్డి వంటి వారితో నిత్యం సమావేశాలు పెడుతున్నారు. ఏం జరిగి ఉంటుంది. ఏం జరుగుతోంది అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నప్పుడే.. తెలంగాణ నేతలు అక్కడ కనిపిస్తున్నారు. కొద్దిరోజుల వరకు సాగిన కర్ణాటక పంచాయతీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడంతో ముగిసింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ పంచాయతీ ప్రారంభమైంది. అలాగని తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు జరగడం లేదు. రేవంత్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుకోవడం లేదు. కాకపోతే కొంత మంది మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు.. తమ శాఖలలో పిచ్చిపిచ్చి పనులు చేస్తున్నట్టు అధిష్టానానికి నివేదిక అందింది. ఇటీవల మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి ఈ విషయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో అధిష్టానం కొన్ని శాఖలలో ప్రక్షాళన చేయాలని భావించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకుడు వెంటనే ఢిల్లీ చేరుకున్నారు. మంత్రులుగా ప్రమోషన్ సాధించాలి అనుకునేవారు రాహుల్ గాంధీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు.

వారిలో ఇప్పటికే గడ్డం ప్రసాద్ తనకు మంత్రి పదవి కేటాయించాలని రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించిన తెలుస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వంటి వారు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రిపై నేరుగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా మాట్లాడుతున్నారు. మంత్రివర్గ ప్రక్షాళన జరుగుతుందని వార్తలు వస్తున్నా నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీ నివాసంలో గాని.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాని కనిపించడం లేదు. ఇంత వరకు విజ్ఞప్తులు అందించినట్టు కూడా సమాచారం అందడం లేదు. అంటే మంత్రివర్గ విస్తరణ ఉంటుందా.. లేక మీడియాకు కాంగ్రెస్ పార్టీ లీకలు ఇస్తోందా.. అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాలంటే మరికొంత సమయం పడుతుందని పొలిటికల్ ఎక్స్ పర్ట్ అంటున్నారు.



# 'క్యూర్' లో సొంతింటి కల సాకారం
## అందుబాటు ధరల్లో ఫ్లాట్ల నిర్మాణం

- గృహనిర్మాణ శాఖ ఉత్తర్వులు జారీ
- ఎల్ఐజి, ఎంఐజి ఫ్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు గ్రీన్ సిగ్నల్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ పరిధిలోని దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'క్యూర్' పరిధిలో అందుబాటు ధరల్లో ఫ్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా లో-ఇన్‌కమ్ గ్రూప్ (ఎల్ఐజి), మిడిల్-ఇన్‌కమ్ గ్రూప్ (ఎంఐజి) ఫ్లాట్లను నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రతిష్టాత్మక పథకం కింద అర్హులైన దిగువ, మధ్య తరగతి ప్రజల కోసం మొత్తంగా ఒక లక్ష ఫ్లాట్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, దీనిని దశలవారీగా చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మొదటి విడత 'పైలట్ ప్రాజెక్ట్' కింద 12 వేల ఫ్లాట్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు హౌసింగ్ బోర్డుకు అనుమతులు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టులో అత్యంత నిరుపేదలు, దిగువ వర్గాల వారికి లబ్ధి చేకూర్చేలా ఎల్ఐజీ ఫ్లాట్లకు భూమి యూడీఎస్ ఇవ్వడంతో పాటు, అదనంగా రూ.5 లక్షల ఆర్థిక సబ్సిడీని కూడా ప్రభుత్వం అందించనుంది. తద్వారా సామాన్యుడికి సైతం ఫ్లాట్ కొనుగోలు భారం తగ్గుతుంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 30.05.2026
www.mudranews.in | @mudranews




**అశ్వగంధతో :**



ఒత్తిడి, ఆందోళనల నుండి ఉపశమనం అశ్వగంధ శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసోల్' హార్మోన్ స్థాయిలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది మనసుకు ప్రశాంతతను చేకూర్చడమే కాకుండా, తీవ్రమైన ఆందోళన మరియు డిప్రెషన్ లక్షణాలను దూరం చేస్తుంది.

## ముగిసిన భగీరథ్ కస్టడీ



**చర్లపల్లి జైలుకు తరలింపు**
**పోక్సో కేసులో కీలక ఆధారాల సేకరణ**
**మొయినాబాద్ ఫాంహౌస్ లో సీన్ రీకన్‌స్ట్రక్షన్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో** : పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కు కోర్టు ఇచ్చిన పోలీస్ కస్టడీ గడువు ముగిసింది. భగీరథ్ ను శుక్రవారం ఉదయం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో, పోలీసులు భగీరథ్‌ను భద్రత నడుమ చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో నమోదైన ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు పోలీసులు గతంలో కోర్టు నుంచి కస్టడీ అనుమతి పొందారు. ఈ కస్టడీ వ్యవధిలో నిందితుడి నుంచి కేసు విచారణకు సంబంధించిన పలు కీలక వివరాలు, ఆధారాలను పోలీసులు సేకరించారు.విచారణ సాగిందిలా..కస్టడీ తొలిరోజు బండి భగీరథ్‌ను చర్లపల్లి జైలు నుంచి నేరుగా మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత మొయినాబాద్‌లోని అరణ్య ఫాంహౌస్‌కు తీసుకెళ్లి, ఘటన జరిగిన తీరుపై 'సీన్ రీకన్‌స్ట్రక్షన్' చేసి విచారించారు. రెండో రోజు గచ్చిబౌలిలోని ఒక సర్వీస్ అపార్ట్‌మెంట్‌కు తరలించి విచారణ జరిపారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో జరిపిన చాటింగ్‌లకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను నిందితుడి ముందు ఉంచి ప్రశ్నించారు. ఈ క్రమంలోనే భగీరథ్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.కీలక ఆధారాల సేకరణబాధితురాలు, ఆమె తల్లితో పాటు ఫామ్‌హౌస్‌కు వెళ్లిన భగీరథ్ స్నేహితుల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలు, కాల్ డేటాతో పాటు బాధితురాలి తల్లి అందించిన కాల్ రికార్డింగ్‌ల గురించి కూడా భగీరథ్ ముందు ప్రస్తావించి, మరికొన్ని కీలక ప్రశ్నలు వేసి సమాధానాలు రికార్డు చేసుకున్నట్లు సమాచారం.

## జగిత్యాలలో పోస్టర్ల లొల్లి..

**బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ సేవాదళ్ పేరుతో వెలిసిన పోస్టర్**
**కౌంటర్ గా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ కు పోస్టర్లు అంటించిన బీజేపీ నాయకులు**
**సేవాదళ్ నాయకుల హౌస్ అరెస్ట్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల లో పోస్టర్ల వివాదం ముదిరింది. గత రెండు రోజుల క్రితం కాంగ్రెస్ సేవాదళ్ పేరుతో గత మున్సిపల్ కౌన్సిల్ హయాంలో మాజీ చైర్మన్ ప్రస్తుత బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ భోగ శ్రావణి చేసిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ పోస్టర్లు వెలిశాయి. శనివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని తైసిల్ చౌరస్తా వద్ద బహిరంగ చర్చకు రావాలని పోస్టర్లు అంటించారు. దీనికి కౌంటర్ గా జగిత్యాల ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని, దీనిపై బహిరంగ చర్చకు ఆదివారం ఉదయం 11 గంటలకు దర్శి తహసిల్ చౌరస్తా వద్ద కు రావాలని జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ కు బీజేపీ నాయకులు గురువారం రాత్రి పోస్టర్లు వేశారు. అభివృద్ధి అని చెప్పి కాంగ్రెస్లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేసిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని పోస్టర్లు గురువారం రాత్రి పోస్టర్లు అంటించారు. సేవాదళ్ పేరుతో కాంగ్రెస్ నాయకుడు బుధవారం జగిత్యాలలో పోస్టర్లు వేయగా, అందుకు కౌంటర్ గా జగిత్యాల లోని పలు కూడలిలో బీజేపీ నాయకులు పోస్టర్లు అంటించారు. ఇది ఇలా ఉంటే శనివారం బహిరంగ చర్చకు వస్తున్నామంటూ బయలుదేరిన కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులను పోలీసులు చేశారు. అయితే ఇన్ని రోజులు కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు విషయంలో జరిగిన రచ్చ పూర్తిగా మాయకముందే ఈ పోస్టర్ల లొల్లి మొదలవడం పట్ల జగిత్యాల రాజకీయాలు రాష్ట్రస్థాయిలో హాట్ టాపిక్ గా నిలిచాయి.

## ఆస్తి కోసం యువతి హత్య

**ఇద్దరు నిందితుల అరెస్ట్   బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూలు జిల్లా బిజినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువతి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆస్తి కోసం యువతిని హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 26వ తేదీ రాత్రి యువతిని కత్తితో హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను నిందితులు అపహరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బిజినపల్లి పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు.29 మే 2026న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి హోండా షైన్ బైక్, కత్తి, మొబైల్ ఫోన్లు, బంగారు చెవి రింగులు, వెండి కాళ్ల పట్టీలు, వెండి లెగ్ చైన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.




## దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య



**ముద్ర, శేరిలింగంపల్లి** :గుర్తు తెలియని మహిళ వయస్సు అందాజా 25 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతి ఉదయం 11 గంటలకు దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని మాదాపూర్ సిఐ డి.కృష్ణమోహన్ తెలిపారు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే పోలీసు, హైడ్రా సహాయంతో దుర్గం చెరువు నీటిలో వెతుకగా గుర్తు తెలియని మహిళ శవం లభించింది. దుర్గం చెరువు లో ఉదయం దూకిన మహిళ చనిపోయిందని, మృతురాలిని పరిశీలించగా వయస్సు అందాజా 25 సం"రాల నుండి 30 సంవత్సరాల లోపు ఉంటుందని, చామన చాయ రంగు కలిగి ఉండి, నలుపు రంగు వెంట్రుకలు, నలుపు రంగు చుడిదార్, క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉన్నదని సీఐ తెలిపారు. చనిపోయిన మహిళ గురించి ఏదైనా ఆచూకీ తెలిసినచో వెంటనె మాదాపూర్ పోలీస్ స్టేషన్ సెల్ నెంబర్ 8712663109, కు లేదా డి.కృష్ణ మోహన్ ఎస్. హెచ్. ఓ మాధాపూర్ సెల్ నెంబర్ 8712663100 మొబైల్ నెంబర్ లకు తెలియజేయవలసిందిగా కోరారు. శవాన్ని పోస్ట్ మార్టమ్ నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

# 'క్యూర్'లో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

**భవిష్యత్ అవసరాలకు**
**అనుగుణంగా నిర్మాణాలు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో** : పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ఉద్దేశంతో అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. యూనిట్గా నియోజకవర్గం..!ప్రతి నియోజక వర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికా రులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ రికార్డ్

**దేశంలోనే తెలంగాణా వాటా 60 శాతం**
**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి**
**ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో** ; ధాన్యం దిగుబడిలోనే కాకుండా కొనుగోళ్లలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ వాటా 60 శాతానికి చేరిందని, ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఇది 75 శాతానికి పెరిగే అవకాశముందని చెప్పారు.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నులు, తమిళనాడులో 11-12 లక్షల మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రలో 3 లక్షల మెట్రిక్ టన్నులు, కేరళలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కాగా, తెలంగాణ ఇప్పటికే 60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందన్నారు. కేంద్రం 52 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే కొనుగోలు లక్ష్యం నిర్ణయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని అధిగమించిందన్నారు.2025-26 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో వరి ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా స్వీకరిస్తున్న బియ్యం పరిమాణాన్ని తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సీఎం A. Revanth Reddyతో కలిసి పలుమార్లు కేంద్ర దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు, దాదాపు 13 వేల రవాణా వాహనాలు, రెండు లక్షలకు పైగా సిబ్బందిని వినియోగిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.11,050 కోట్లు నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ఖరీఫ్, యాసంగి కలిపి 2025-26 సీజన్‌లో కొనుగోళ్లు, రవాణా, చెల్లింపులపై సుమారు రూ.39,300 కోట్ల వ్యయం జరుగుతోందన్నారు.అకాల వర్షాలతో తడిసిన 10,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులు తీసుకొచ్చే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, నిజంగా రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు మరింత ధాన్యం కొనుగోలు కోటా పెంచాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని బీజేపీ నేతలకు సూచించారు.

# రైతు డిస్కమ్ పేరుతో ప్రభుత్వ కుట్ర

**రైతులకు మంచి నిర్ణయమైతే ఆరు నెలలు ఎందుకు సీక్రెట్ గా ఉంచారు ?**
**డిస్కమ్ లకు రూ. వేల కోట్ల బకాయిలతో సర్కార్ ద్రోహం**
**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ముద్ర, తెలంగాణ బ్యూరో** : రైతు డిస్కమ్ పేరుతో తెలంగాణ రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీసే కుట్ర జరుగుతోందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రైతులకు మేలు చేసే నిర్ణయమైతే ప్రభుత్వం ఆరు నెలల పాటు ఎందుకు రహస్యంగా ఉంచిందని ఆమె ప్రశ్నించారు. ఎర్రగడ్డలో జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొన్న కవిత, రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.డిస్కమ్‌లకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేల కోట్ల బకాయిలే ఆ సంస్థల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశాయని, ఇప్పుడు అదే సమస్యను సాకుగా చూపించి కొత్త డిస్కమ్ పేరుతో రైతులపై భారం మోపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కొత్త డిస్కమ్‌కు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, విద్యుత్ సేవల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తెలంగాణ రైతుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ కీలక అంశంపై రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్‌లు నిర్వహించాలని ఈఆర్సీని కవిత కోరారు. రైతులకు అన్యాయం చేసే ఈ ప్రతిపాదనను వెంటనే తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్

**రూ.2,000 కోట్లతో ఊరటబకాయిల విడుదలకు శ్రీకారం**
**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్కార్**
**వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు విడుదల చేస్తామన్న డిప్యూటీ సీఎం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో** : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్.. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపితమైంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6వేల కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది మే వరకు పెండింగ్ లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4వేల కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.




## అశ్వగంధతో : రోగనిరోధక శక్తి పెంపు

ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి, వ్యాధినిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. వృద్ధాప్యంలో వచ్చే రకరకాల ఇన్ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల బారి నుండి ఇది శరీరాన్ని రక్షిస్తుంది.



# విద్యార్థి మరణాలతో వ్యవస్థ సంక్షోభం



దేశంలో విద్యార్థుల స్వీయ మరణాలు పెరుగుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జ్ఞానాన్ని అందించాల్సిన విద్యాసంస్థలు క్రమంగా ఒత్తిడి కేంద్రాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు విద్యను వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి మార్గంగా భావించేవారు. కానీ ఇప్పుడు మార్కులు, ర్యాంకులు, ఉద్యోగ పోటీ, కార్పొరేట్ కోచింగ్‌ల చుట్టూ తిరిగే వ్యవస్థగా మారిపోవడంతో విద్యార్థులపై మానసిక భారం పెరుగుతోంది. 2024లో దేశవ్యాప్తంగా 14,488 మంది విద్యార్థులు స్వీయ మరణాలకు పాల్పడడం కేవలం ఒక గణాంకం కాదు.. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలకు హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది.

జాతీయ నేర గణాంకాల బ్యూరో ప్రకారం 2015లో 8,934గా ఉన్న విద్యార్థుల స్వీయ మరణాల సంఖ్య 2024 నాటికి 14,488కు చేరింది. ప్రతి సంఖ్య వెనుక ఒక కుటుంబం యొక్క విషాదం, నెరవేరని కలలు ఉన్నాయి. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యాసంస్థల్లో కూడా ఇలాంటి ఘటనలు పెరుగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన విద్యా అవకాశాలు కల్పించాలని పేర్కొన్నప్పటికీ, విద్యా రంగంలో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. ఆర్థికంగా బలమైన కుటుంబాలకు కార్పొరేట్ విద్యాసంస్థలు, ఖరీదైన కోచింగ్ సెంటర్లు, డిజిటల్ వనరులు అందుబాటులో ఉంటే, పేద మరియు గ్రామీణ విద్యార్థులు పరిమిత అవకాశాలతోనే పోటీ ప్రపంచంలో నిలబడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒకే విధమైన పరీక్షలు, ప్రమాణాలు అమలు కావడం సమాన అవకాశాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత కంటే మార్కులు, ర్యాంకులకే అధిక ప్రాధాన్యం పెరిగింది. పరీక్షలు అభ్యాస ప్రక్రియలో భాగంగా కాకుండా జీవితాన్ని నిర్ణయించే అంశాలుగా మారాయి. తల్లిదండ్రుల అంచనాలు, ఉపాధ్యాయుల ఒత్తిడి, సమాజపు పోలికలు, ఉద్యోగ భవిష్యత్తుపై భయం కలిసి విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ విద్యా వ్యవస్థలో ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగే కోచింగ్, పరీక్షల సంస్కృతి విద్యార్థుల భావోద్వేగ సమతుల్యతపై ప్రభావం చూపుతోంది.

మరోవైపు విద్యాసంస్థల్లో మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, మెంటారింగ్ వ్యవస్థలు ఆశించిన స్థాయిలో లేవు. విద్యార్థుల్లో డిప్రెషన్, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సహాయం చేసే వ్యవస్థలు బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. విద్య క్రమంగా వ్యాపార రంగంగా మారిపోవడం వల్ల నాణ్యమైన విద్య డబ్బున్న వర్గాలకు మాత్రమే పరిమితమవుతోందనే విమర్శలు కూడా పెరుగుతున్నాయి.

ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు స్వయంగా ప్రైవేట్ విద్యాసంస్థలను నిర్వహిస్తున్న పరిస్థితుల్లో నియంత్రణ వ్యవస్థల ప్రభావంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యను వ్యాపార రంగంగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం మరింత పెరిగింది. అదే సమయంలో కుటుంబాలు కూడా పిల్లలను ఇతరులతో పోల్చడం, మార్కులనే విజయానికి కొలమానంగా చూడడం మానుకోవాలి.

విద్యార్థుల మరణాలను కేవలం వ్యక్తిగత విషాదాలుగా చూడడం సరిపోదు. ఇది మొత్తం విద్యా-సామాజిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభంగా అర్థం చేసుకోవాలి. విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు, సమాజం కలిసి విద్యార్థులకు మానసిక భద్రత, సమాన అవకాశాలు, వివక్ష రహిత వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. విద్యను పోటీ కేంద్రంగా కాకుండా మానవీయ విలువలు, సమానత్వం, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సామాజిక హక్కుగా మలచగలిగితేనే ఇటువంటి విషాదాలకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుంది.




- పాపని నాగరాజు
9948872190,


# సెక్స్ వర్కర్లుగా మారడం నేరం కాదు

**- పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలి -వారికి ఆధార్ కార్డులు జారీ చేయాలి**

**- తీర్పుల ఆలస్యంపైనా సుప్రీంలో విచారణ**

**ముద్ర డెస్క్ :** దేశంలో మానవ అక్రమ రవాణానుఅరికట్టడంతో పాటు సెక్స్ వర్కర్ల హక్కులను కాపాడేందుకు సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన మార్గదర్శకాలను జారీ చేసింది. స్వచ్ఛందంగా లైంగిక వృత్తి (సెక్స్ వర్కర్లుగా మారుతున్న వారు)ని ఎంచుకున్న వయోజనులకు, బలవంతంగా ఈ రొంపిలోకి లాగిన బాధితులకు మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వానికి, పోలీసులకు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం దేశంలో ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని, కేవలం లైంగిక వృత్తిలో ఉందనే ఏకైక కారణంతో ఏ తల్లి నుంచైనా ఆమె బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

**పోలీసులకు కఠిన ఆదేశాలు.. మీడియాకు హెచ్చరికలు**

తన వ్యక్తిగత కారణాలతో సొంతంగా, ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై అనవసరంగా దాడులు చేయడం, వారిని వేధించడం లేదా క్రిమినల్ కేసులు పెట్టడం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు పోలీసులను ఆదేశించింది. అలాగే, రెస్క్యూ ఆపరేషన్లు లేదా దాడులు నిర్వహించే సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలను ప్రసారం చేయడం లేదా వారి గుర్తింపును వెల్లడించడం తీవ్రమైన నేరమని మీడియాకు హెచ్చరికలు జారీ చేసింది. స్వచ్ఛందంగా ఈ వృత్తిలో ఉన్నవారిని వదిలిపెట్టి.. మహిళలు, మైనర్లను బలవంతంగా అక్రమ రవాణా చేసే మాఫియాపై మాత్రమే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

**ఆధార్ కార్డుల జారీకి స్పష్టమైన ఆదేశం**

సెక్స్ వర్కర్లకు ఇతర వ్యక్తుల తరహాలోనే సమాన చట్టపరమైన రక్షణ కల్పించడంలో భాగంగా సుప్రీంకోర్టు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. నివాస ధృవీకరణ పత్రాలు (అడ్రస్ ప్రూఫ్) లేకపోయినప్పటికీ, సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులను జారీ చేయాలని యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీని ద్వారా వారికి సామాజిక భద్రతతో పాటు ఇతర వ్యక్తుల తరహాలోనే ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందే అవకాశం లభిస్తుందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

**తీర్పులపై హైకోర్టులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..**

హైకోర్టులలో విచారణలు పూర్తయిన తర్వాత తీర్పుల ప్రకటనలో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించడమే లక్ష్యంగా సుప్రీంకోర్టు శుక్రవారం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది.

# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

**18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్ చేసేలా సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు**
**- ప్రభుత్వ భవనాలపై సోలార్ ఏర్పాటు పనులు త్వరితగతిన చేపట్టాలి**
**- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సొలారైజేషన్**
**- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు**
**- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**




**ముద్ర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ కారిడార్–3 కింద రూ.22 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ కారిడార్ ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించనున్నారు. ఇందుకోసం 2,261 కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్లు, 9,500 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. నెట్ జీరో విధానంలో 2,898 హాస్టళ్లు, పాఠశాలల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం, సీబీజీ ప్లాంట్ల ప్రోత్సాహంపై కూడా సీఎం దృష్టి సారించారు. అలాగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధులతో సమావేశమైన సీఎం, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏపీని ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.


## నిమిషాంబికను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

**బోడుప్పల్, ముద్ర:** హైదరాబాద్ బోడుప్పల్ పెంటారెడ్డి కాలనీలో వేంచేసివున్న మాతా నిమిషాంబికా ఆలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత దర్శనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆమెను నిమిషాంబిక ఆలయ ధర్మకర్తల మండలి ఆలయ సంప్రదాయాల మేరకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర శర్మ, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్య దర్శి కొరిచర్ల శ్రీనివాసరావు న్యాయమూర్తికి ఆలయ వైశిష్ట్యాన్ని వివరించారు. ఆల య ధర్మకర్తల మండలి చైర్మన్ కామరౌతు వినోద్ కుమా ర్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ అమ్మ వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని న్యాయమూర్తికి అందించి సత్కరించారు.



# ఉద్యోగుల బకాయిలు రిలీజ్

**తొలి విడతగా రూ. 2వేల కోట్లు విడుదల**
**వంద రోజుల్లో రూ. 6వేల కోట్లు విడుదల చేస్తామన్న డిప్యూటీ సీఎం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్.. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపితమైంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపించింది. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ. 6వేల కోట్లు విడుదల చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విడుదల చేసిన నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని వంద శాతం క్లియర్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది మే వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైంది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4వేల కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోంది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ శ్రద్ధ, శరవేగ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పుష్కర స్నానంతో ఆధ్యాత్మిక సందడి..

**- భక్తులను ఆశీర్వదించిన స్వరూపానందేంద్ర స్వామీజీ**





**మహాదేవపూర్/బోడుప్పల్, ముద్ర:** విశాఖ పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ శుక్రవారం కాళేశ్వరం త్రివేణి సంగమంలోని సరస్వతి ఘాట్ వద్ద పుష్కర స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి, శుభానంద దేవి అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతంతో స్వామీజీకి ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వాన్ని స్వామీజీ అభినందించారు. కాళేశ్వరం వద్ద చేపట్టిన ఏర్పాట్లు హిమాలయ ప్రాంతాల్లో ఉన్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపిస్తున్నాయని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పం అభినందనీయమన్నారు. భక్తి భావాలు పెరిగి యువత దేశానికి వెన్నెముకలా ఎదగాలని ఆశీర్వదించారు. ఇక హైదరాబాద్ బోడుప్పల్‌లోని మాతా నిమిషాంబిక ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ విశిష్టతను వివరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు.

# జాతీయ రహదారుల నిర్వహణ ప్రైవేట్ కు

**- 17 రహదారులతో తాత్కాలిక జాబితా - రాష్ట్రంలో నుంచి ఎన్ హెచ్ 163**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్వహణ మరియు అభివృద్ధిని వేగవంతం చేయడానికి జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ కొత్త వ్యూహాన్ని అమలు చేయనుంది. దీని భాగంగా దేశంలోని 17 ముఖ్యమైన జాతీయ రహదారులను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యం. ప్రైవేట్ కు ఎన్‌హెచ్–163 మార్గంలోని యాదగిరి–వరంగల్ సెక్షన్ నిర్వహణ ఈ జాబితాలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్‌హెచ్–163 మార్గంలోని యాదగిరి–వరంగల్ సెక్షన్ ఉంది. ఈ సెక్షన్‌ను రెండు ప్యాకేజీలుగా విభజించి ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వనున్నారు. మొత్తం 99.1 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిపై కోమళ్ల మరియు కోమటపల్లి టోల్ ప్లాజాల పరిధిలోని భాగాలు ఇందులో భాగం. దీంతో రహదారి నిర్వహణ బాధ్యతలు, టోల్ వసూళ్లు అన్నీ ప్రైవేటు సంస్థలకు చెందుతాయి.

**నిధుల సమీకరణకు మార్గం**

ఎన్‌హెచ్ఏఐ ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం నిధుల సమీకరణ. జాతీయ రహదారుల అభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన భారీ మొత్తంలో నిధులు సమకూర్చుకోవడానికి ఈ మార్గం సహాయకరంగా ఉంటుంది. రహదారులను లీజుకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ భారం తగ్గి, ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించవచ్చు.ఈ ప్రక్రియను రెండు పద్ధతుల్లో అమలు చేయనున్నారు. రెండు పద్ధతులలో టోల్ వసూళ్లు, రోడ్ల నిర్వహణ మొదటి పద్ధతి టోల్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్. ఈ మోడల్‌లో ప్రైవేటు సంస్థలు ప్రభుత్వానికి భారీ మొత్తంలో చెల్లింపులు చేసి, నిర్ణీత కాలం వరకు టోల్ వసూళ్లు మరియు నిర్వహణ హక్కులు పొందుతాయి. రెండవ పద్ధతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్. ఇది మ్యూచువల్ ఫండ్ లాంటి వ్యవస్థ, ఇందులో ఇన్వెస్టర్ల నుంచి నిధులు సేకరించి రోడ్డు ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టడం జరుగుతుంది. ఈ రాష్ట్రాల్లో 17 రహదారులతో తాత్కాలిక జాబితా హరియాణా, ఝార్ఖండ్ నుంచి మూడు రహదారులు, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ నుంచి రెండు చొప్పున, కర్ణాటక, బిహార్ నుంచి ఒక్కొక్కటి చొప్పున ఈ జాబితాలో ఉన్నాయి. తెలంగాణలో యాదగిరి–వరంగల్ మార్గం మెరుగైన నిర్వహణ, సకాలంలో మరమ్మతులు, మెరుగైన సౌకర్యాలు అందించడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త ఊపు**

ఈ కొత్త విధానం దేశవ్యాప్తంగా రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త ఊపు ఇవ్వనుంది. ప్రైవేటు రంగం పాల్గొనడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది. అయితే, టోల్ రేట్లు పెరిగే అవకాశం ఉండొచ్చని ప్రజలు ఆందోళనలో ఉన్నారు . ఎన్‌హెచ్ఏఐ ఈ ప్రాజెక్టులను పారదర్శకంగా అమలు చేస్తే రహదారి వినియోగదారులకు మేలు చేస్తుందని రవాణా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమరుల త్యాగాలను మరువం..

**అమరుల కుటుంబాలకు సర్కార్ అండగా నిలుసుంది..**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



ముద్ర , నల్గొండ/ మోత్కూర్: ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు మరువమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళ కమీషన్ సభ్యులు ఎన్నికైన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధిస్తే యువతకు ఉద్యోగాలు రావడంతో పాటు తెలంగాణలోని అన్ని వర్గాలకు ప్రజలకు మేలు జరుగుతుందని భావించి అనేక మంది స్వరాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో వీర నారి చాకలి అయిలమ్మ, మలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరుడు శ్రీకాంత చారీ ప్రాణాలు త్యాగం చేశారని మంత్రి గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాడితే తెలంగాణ రాష్టంలో అమరులైన వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని మంత్రి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్, అందెశ్రీ తో పాటు పలువురికి ప్రభుత్వం పారితోషకం అందించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కడుపు కోత తీర్చాలని శంకరమ్మ గారికి మహిళ కమీషన్ సభ్యురాలిగా నియమించడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవరించిన చాకలి అయిలమ్మ వారసురాలు శ్వేత గారిని మహిళ కమీషన్ సభ్యులుగా ప్రభుత్వం నియమించిందని మంత్రి అడ్లూరి తెలిపారు. కొత్తగా మహిళ కమీషన్ సభ్యులుగా ఎన్నికైన ఇద్దరు రాష్టంలోని మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి అడ్లూరి కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 30-05-2026
www.mudranews.in | @mudranews

5
దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

**అశ్వగంధతో కండరాల బలం, శారీరక దారుఢ్యం**

అశ్వగంధ శరీరానికి మంచి రసాయనంగా పనిచేసి, కండరాల క్షీణతను అడ్డుకుంటుంది మరియు శరీరానికి అవసరమైన శక్తిని ఇస్తుంది. దీర్ఘకాలిక జబ్బుల వల్ల లేదా వయసు పైబడటం వల్ల వచ్చే శారీరక దుర్బలత్వాన్ని ఇది సమర్థవంతంగా నివారిస్తుంది.



## మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

**- సీపీ సుమతి**

**ముద్ర, మల్కాజ్గిరి:**

మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన వారికి ప్రవర్తనా మార్పు తీసుకు రావడం లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ షీ టీం ఆధ్వర్యంలో గురువారం "సంస్కార్ మెగా కౌన్సిలింగ్ కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల పట్ల గౌరవం, చట్టాలపై అవగాహన, సామాజిక బాధ్యతలపై నిపుణులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. 2026 జనవరి నుంచి మే 18 వరకు షీ టీం 61 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 760 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వీరిలో ఎక్కువ మంది యువకులే ఉండటం ఆందోళన కలిగించే విషయమన్నారు.

ఈ కార్యక్రమంలో మనో జాగృతి సంస్థ సైకాలజిస్టులు, న్యాయ నిపుణులు పలు సూచనలు చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

**- మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, నారాయణపేట:**

ఉపాధ్యాయుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్లో శుక్రవారం టిఆర్ టియు టీఎస్ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫామ్ లు, పాఠ్యపుస్తకాలు మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.

కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయని... తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి బాల్య వివాహాలను నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఉన్నప్పటికీ జిల్లాలో ఉన్న 38 ప్రభుత్వ పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు



ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందించి అభినందించారు. కాగా కీర్తిశేషులు వామన్ గేరి సత్యపాల్ జ్ఞాపకార్థం ప్రతిభా పురస్కారాలను దాతగా అందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ కొండా శ్వేత, మార్కెట్ చైర్మన్ సదాశివ రెడ్డి, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె. రాజ్ కుమార్ రెడ్డి, పేరి వెంకటరెడ్డి, డీఈఓ గోవిందరాజులు, కౌన్సిలర్ గొల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

**- యూత్ కాంగ్రెస్ ధర్నా**

**ముద్ర తాండూరు, ప్రతినిధి:**

కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ యువ జన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా చౌరస్తా వద్ద ధర్నా చేశారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమేర్ అబ్దుల్, తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరలు



పెంచుతూ పేదల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. 2014లో ఉన్న క్రూడ్ ఆయిల్ ధర 2024 వరకు 10 డాలర్లు తగ్గినా కూడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రెండింతలు పెంచారని అన్నారు. వీటి ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఉపయోగించే నిత్యవసర వస్తువుల పైన కూడా భారం పడుతుందని అన్నారు. పేదలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, కె జగదీష్, మండల అధ్యక్షుడు సుధాకర్, బషీరాబాద్ మండల అధ్యక్షుడు సతీష్, పెద్దేముల్ మండల అధ్యక్షుడు మహేష్, సందీప్ రెడ్డి, శ్రీహరి, మాణిక్, రఫీక్, జగదీష్, నవీన్, తేజ, సునీల్, రామకృష్ణ, సురేష్, సుధీర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'చేయూత' యాప్‌లో పెన్షన్ లబ్ధిదారుల వివరాల నమోదు

**ముద్ర కూకట్‌పల్లి:**

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన "చేయూత" యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు, ఫోటోలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసోర్స్ పర్సన్ జానకి తదితరులు పాల్గొని ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

## ఉప్పునుంతలలో ఎరువుల దుకాణాల తనిఖీలు

**ముద్ర, మహబూబ్ నగర్:**

మహబూబ్ నగర్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రమేష్ తనిఖీలు నిర్వహించారు. ఎరువుల బస్తాల నిల్వలను బోర్డుపై ఉంచాలని వ్యాపారులకు సూచించారు. రిజిస్టర్‌లో రాసిన నిల్వలు, దుకాణంలో ఉన్నవి సక్రమంగా ఉన్నాయో లేవోనని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని వ్యాపారులను ఆయన హెచ్చరించారు.

## మక్తల్ ఎస్సై వీఆర్ కు అటాచ్...

**- నూతన ఎస్సై రాజు బాధ్యతల స్వీకరణ**



**ముద్ర, నారాయణపేట:** మక్తల్ ఎస్సైగా సుదీర్ఘకాలం నుంచి పని చేస్తున్న భాగ్యలక్ష్మి రెడ్డి అనూహ్యంగా వీఆర్ కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మక్తల్ నూతన ఎస్సైగా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజు ఇదివరకు దామరగిద్ద మండల ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. అంతకుముందుగా ఎస్ఐ రాజు ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## బ్యాంక్ అఫ్ ఇండియా మేనేజర్ కు ఘన సన్మానం



**ముద్ర, బాలానగర్:** బ్యాంక్ అఫ్ ఇండియా బాలానగర్ బ్రాంచ్ కు నూతన మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన రంజు థామస్ ను చిన్న తరహా పారిశ్రామిక ప్రతినిధులు మానస టూల్ టెక్ అదినేత ,ప్రముఖ కవి వాకిటి రామ్ రెడ్డి, గీతా నగర్ సూక్ష్మ చిన్నతరహా ప్రతి నిధి ఉపేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుక్రవారం ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా వాకిటి రామ్ రెడ్డి మాట్లడుతూ బ్యాంక్ అఫ్ ఇండియా చిన్నతరహా పరిశ్రమలకు ఋణాలు మంజూరు చెస్తూ తెలంగాణ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారని, అర్హత నైపుణ్యం కలిగిన నిరుద్యోగులకు ఋణాలు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో బ్యాంక్ అఫ్ ఇండియా క్రెడిట్ మేనేజర్ సుధాకర్, సిబ్బంది సునిత పాల్గొన్నారు.

## రైల్వే ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**ముద్ర, మల్కాజ్గిరి:** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైల్వే ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ అభివృద్ధి, విద్యుత్ సరఫరా సంబంధిత అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్యుత్ వైర్లను అండర్‌గ్రౌండ్‌లోకి మార్చే పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే సెక్షన్ ఇంజనీర్ రాజేంద్ర ప్రసాద్, రవి ప్రకాష్, రైల్వే యూనియన్ సభ్యులు నూరుద్దీన్, టీజీఎస్పీ సిడిఎల్ విద్యుత్ అధికారులు ఎస్ ఈ వెంకన్న, డిఈ అన్వర్ పాషాలతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురుగేష్, సిద్ధిరాములు, నర్సింగ్ రావు, నరహరి పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డి నగర్‌లో పాముల బెడదపై ఎమ్మెల్యేకు వినతి

**ముద్ర, కాప్రా:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి నగర్ కాలనీ లో ఎన్ఎఫ్‌సీ గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న కంపౌండ్ వాల్ పక్కన పెరి గిన చెట్ల కారణంగా పాముల బెడ ద పెరిగిందని స్థానికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే ఎన్ ఎఫ్‌సీ శాఖ అధికారులతో మాట్లాడగా, వారు సమస్యను సానుకూలంగా స్వీకరించి కంపౌండ్ వాల్‌కు ఆనుకుని ఉన్న చెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శేఖర్ నాయక్, ట్రెజరర్ శంకర్ నాయక్, అఖిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు ఆలస్యం లేకుండా సేవలు అందించాలి

**- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రెవెన్యూ అధికారులు ప్రజలకు సమయ పాలనతో సేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ భారతి, మ్యూటేషన్ కేసులు, ధాన్యం కొనుగోళ్లు, జనగణన, కొత్త రేషన్ కార్డులు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని, రవాణా సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. జనగణన ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలని, పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో



కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ

నాగర్‌కర్నూల్ జిల్లాలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 35 వేల మెట్రిక్ టన్నుల వరి, 1.75 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రా ల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మధ్యవర్తుల జోక్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి అపోహలు నమ్మకుండా ధాన్యా న్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని కలెక్టర్ సూచించారు.

## టీపీసీసీ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ గా నిరంజన్

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకేశ్వరం నిరంజన్‌ను టీపీసీసీ ఎస్సీ విభాగం నాగర్‌కర్నూల్ జిల్లా చైర్మన్‌గా నియమిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వెంకేశ్వరం నిరంజన్‌కు ఈ బాధ్యతలు రావడం ఆనందదాయకమని తెలిపారు. జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ సామాజిక న్యాయం సాధనలో ముందుండాలని ఆకాంక్షించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ నియామకం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిరంజన్ నాయకత్వంలో జిల్లాలో ఎస్సీ విభాగం మరింత చురుకుగా పనిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వెంకేశ్వరం నిరంజన్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

## రోడ్డుపై పడిన చెట్టును తొలగించిన పోలీసులు

**- అభినందించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి రోడ్డుపై భారీ చెట్టు పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

విషయం తెలుసుకున్న తెలకపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నైట్ బ్లూ కోర్ట్ కానిస్టేబుల్స్ ప్రభాకర్, శ్రీను నాయక్ వెంటనే అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగాయి.

చాకచక్యంగా స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్న కానిస్టేబుల్స్ ప్రభాకర్, శ్రీను నాయక్‌లను ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందించారు.



**అశ్వగంధం:**

కీళ్ల నొప్పులు, వాపుల నివారణ

ఇది ఒక సహజసిద్ధమైన 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' ఏజెంట్‌గా పనిచేస్తూ శరీరంలోని వాపులను నయం చేస్తుంది. మోకాళ్ల నొప్పులు, కీళ్ల వాతం నొప్పుల తీవ్రతను తగ్గించడంలో సహాయపడుతుంది.



# మార్కెట్ కు లారీలు పంపిస్తా

**- రైతులు ఆందోళన చెందొద్దు**

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



**బోథ్, ముద్ర:** మార్కెట్ యార్డ్ కు అమ్మకానికి తెచ్చిన జొన్నలను తరలించడానికి కావాల్సిన లారీలను తాను పంపిస్తానని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన బోథ్ మార్కెట్ యార్డ్ ను సందర్శించారు. మార్కెట్ యార్డ్ కు అమ్మకానికి తెచ్చిన జొన్న రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. లారీల కొరత కారణంగా జొన్నల కొనుగోళ్లు ఆలస్యం అవుతుందని, వర్షాలు కూడా తమను ఆందోళనకు గురి చేస్తున్నాయని రైతులు తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే లారీలను పంపిస్తానని ఓపికతో, ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఎకరానికి కేవలం పది క్వింటాళ్ల వరకే కొనుగోలు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతుండగా, మరోవైపు కొనుగోలు చేసిన పంటలను రవాణా చేయకపోవడంతో వారి కష్టాలు మరింత పెరుగుతున్నాయన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఇంకా ఆలస్యం చేయకుండా, షరతులు విధించకుండా జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు పూర్తిగా మద్దతుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ లు రాజేందర్, రవీందర్, బాబులాల్, నాయకులు ఎలుక రాజు, నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, వీడీసీ పోతన్న, రమణ గౌడ్, వార్డు మెంబర్ ప్రవీణ్, గంగమల్లు, రమణ రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల లో ఉద్రిక్తత

**- రోడ్డుపై ఆవు ఎముకలు పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు**

**- హిందూ సంఘాల ఆందోళన**



**ముద్ర, కోరుట్ల:** మూగజంతువు(ఆవు) ఎముకలు, కాళ్లు రోడ్డుపై కనిపించడం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గురువారం రాత్రి కలకలం రేపింది. పట్టణంలోని నికపిల్ చిట్ ఫండ్ అఫీస్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఆవు ఎముకలు, కాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు పడేశారు. విషయం తెలియడంతో హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. హిందూ మనోభావాలను దెబ్బ తీసేలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ రోడ్డు పై బైఠాయించారు. సమచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా పోలీసులకు హిందూసంఘల వారికి మధ్య కొద్ది సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. మున్సిపల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక సామరస్యాన్ని భంగపరచే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానించారు. వెంటనే సానిటరీ ఇన్ స్పెక్టర్ వద్ద ఫిర్యాదు తీసుకోని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వెంటనే స్పెషల్ టీం లను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించి, జంతు కళేబరాలను తీసుకెళ్తున్న వాహనం వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా ఆ వాహనాన్ని రాత్రే అదుపులోకి తీసుకోని వాహనం యజమాని, దానిని నడిపిన డ్రైవర్ ను అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

## కేసీఆర్ కిట్ ను అమలు చేయాలి



**ముద్ర, కరీంనగర్:** కేసీఆర్ కిట్ పథకాన్ని తిరిగి అమలు చేయా లని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, ప్రసూతి సేవలు పొందిన మహిళలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రసూతి సేవలు పొందిన మహిళలకు 'కేసీఆర్ కిట్' అందించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేసిందని విమర్శించారు. వెంటనే కేసీఆర్ కిట్ పథకాన్ని తిరిగి అమలు చేయాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమన్నారు. ఆసుపత్రికి మరిన్ని ఆధునిక వైద్య పరికరాలు అందించాలని, సరిపడా వైద్య సిబ్బందిని వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దు

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ధాన్యం అన్ లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆయన ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను శుక్రవారం తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న సేవలపై సమీక్షించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్ లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్ లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహాశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, అధికారులు ఉన్నారు.

## స్వయం ఉపాధి కోర్సులపై అవగాహన



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యాపకులు మ్యాదరి రాకేష్ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారి సహకారంతో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తుందన్నారు. మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీషియన్, పుట్టగొడుగుల పెంపకం, జ్యూట్ బ్యాగుల తయారీ, ఇమిటేషన్ జ్యువలరీ, సిసిటివి ఇంస్టాలేషన్, మల్టీ ఫోన్ రిపేరింగ్, ఏసీ అండ్ ఫ్రిజ్ రిపేరింగ్, ఫోటో, వీడియో గ్రాఫి, హౌస్ వైరింగ్ వంటి కోర్సులకు దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి, శిక్షణకు కావలసిన మెటీరియల్, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, అర్హులైన వారికి బ్యాంకు లోను ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని జగిత్యాల జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకి 9502869491 నంబర్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో అయిలాపూర్ సర్పంచ్ ద్యావనపెల్లి రామకృష్ణ, ఉప సర్పంచ్ వనపర్తి సౌమ్య, వార్డు సభ్యులు, మహిళలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల పట్టణంలోని ఎస్కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో శుక్రవారం పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. సుమారు 250 మంది విద్యార్థులు తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ నెలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నదని తెలి పారు. జగిత్యాల పరిసర ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ఎస్కేఎన్ఆర్ జీఏఎస్సీ జగిత్యాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 1 వరకు కొనసాగుతుందని తెలిపారు.

విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన కోర్సులు, కళాశాలల ఎంపికలో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. పాలిటెక్నిక్ విద్య సాంకేతిక రంగంలో మంచి అవకాశాలను అందిస్తుందన్నారు.ప్రభుత్వ. ప్రైవేట్ రంగాలలో ఉపాధి అవ కాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. అందువల్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి



**ముద్ర, కరీంనగర్:** మంథనిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు. అధికారులను అడిగి నిల్వల సమాచారం తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఎక్కడా వరి ధ్యానం కుప్పలు నిల్వ లేకుండా కొనుగోలు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యంతో అకాల వర్షాలు కురవడంతో సమస్య తలెత్తిందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా సేకరిస్తామని, ప్రతి రైతును ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. వరి పంట వేయకూడదని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాణిజ్య పంటలు పండించడం ద్వారా రైతులకు అధిక లాభం వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారని, అలాంటి పంటలు సాగు చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. రైతులు పంట కోతల అనంతరం వరి కొయ్యలను కాల్చడం వల్ల కాలుష్యం ఏర్పడుతుందని, ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతుందని, భూసారం దెబ్బతింటుందని వివరించారు. వరి పంట అవశేషాలను కాల్చి.. భూసారాన్ని తగ్గించవద్దని, రైతులను తప్పుదోవ పట్టిస్తున్న వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

## బిజిగిర్ షరీఫ్ దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే



**ముద్ర, కరీంనగర్:** కరీంగనగర్ జిల్లాలోని జమ్మికుంట బిజిగిర్ షరీఫ్ దర్గాలో ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దర్గాలో చాదర్లు సమర్పించారు. మత గురువు మౌలానా యాసీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేను దర్గా కమిటీ ప్రతినిధులు సన్మానించారు. సర్పంచ్ రాచపల్లి వనజ, గంద్రపల్లి సర్పంచ్ తోట కవిత, బీఆర్ఎస్ నాయకులు పి. రమేష్, పొనగంటి సంపత్, పొనగంటి రాము చీలుమల్ల రామస్వామి, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సమీర్, దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు.


## 'ప్రత్యేక ఓటరు జాబితా' పకడ్బందీగా చేయాలి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఈఆర్‌వోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 30.05.2026
www.mudranews.in | @mudranews



అశ్వగంధతో మెరుగైన నిద్ర
(మంచి నిద్రపట్టడం)
నిద్రలేమి సమస్యతో బాధ పడేవారికి అశ్వగంధ చూర్ణం ఒక అద్భుతమైన ఔషధం. రాత్రి పడుకునే ముందు దీన్ని తీసుకోవడం వల్ల నరాలకు విశ్రాంతి దొరికి, హాయిగా గాఢనిద్ర పడుతుంది.



## తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి



**ముద్ర, తుంగతుర్తి:** తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన వారికి సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు కోరారు .ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో తెలంగాణ ఉద్యమకారులు నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ఉద్యమకారులకు హామీ ఇచ్చారని ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేసే విధంగా కేశవరావు ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కమిటీ ఆధ్వర్యంలో అమరుల కుటుంబాలను గుర్తించి గౌరవించడం, జైలుకు పోయిన వారిని గుర్తించడం, ఎఫ్ఐఆర్ నమోదయ నిర్బంధానికి గురైన వారిని గుర్తించడం, తెలంగాణ ఉద్యమంలో వివిధ దశల్లో పోరాటం చేసిన వారిని గుర్తించి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రకటించిన హామీలను అమలు చేయాలన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు, ప్రతి ఒక్కరు గ్రామ గ్రామాన తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి ముందు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అసువులు బాసిన అమరవీరులకు అలాగే తుంగతుర్తి ప్రాంతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఇటీవల మృతి చెందిన ఉద్యమకారుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణను స్మరిస్తూ సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులు పోలవరపు సంతోష్, ఎండి నసీరుద్దీన్, శంకరమంచి రవీందర్ శర్మ, దుగ్యాల రవీందర్రావు, ఎండి.జానీ, గునిగంటి సంతోష్ గౌడ్, తడకమళ్ళ రవికుమార్, బానోతు వెంకన్న, బెడద రాములు, గౌడిచర్ల రాఘవులు, ఓరుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళా భవనం నిర్మాణానికి శంకుస్థాపన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని తాజ్‌పూర్ గ్రామ పంచాయితీకి నూతనంగా మంజూరైన 'మహిళా భవనం' నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీడీఓ దినకర్, పిఆర్ఎఇ శ్యామ్ సుందర్ రెడ్డి, సామాజిక వేత్త డా. ర్యాకల శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు, వారి సంఘ సమావేశాలను సులువుగా నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయితీ కార్యదర్శి బి. నరేందర్, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకూబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్, సంఘ బంధం అధ్యక్షురాలు వరిగంటి రమ్య, సభ్యులు గుల్వాని రమ్య, బొమ్మారపు శ్రీలత, వీబీకే బొమ్మారపు అనురాధలతో, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వలిగొండ ఠాణాను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వలిగొండ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ, అత్యవసర సమయాల్లో స్పందించే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. స్టేషన్లోని రిసెప్షన్ కౌంటర్, క్రైమ్ విభాగం, జనరల్ డైరీ నిర్వహణను ఎస్పీ నిశితంగా పరిశీలించారు. వాహనాల్లోని సైరన్లు, కమ్యూనికేషన్ సెట్లు, జీపీఎస్ వ్యవస్థల పనితీరును అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. దర్యాప్తును వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా చార్జ్ షీట్లు దాఖలు చేయాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే సహాయం అందించాలన్నారు. అర్హత గల ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని శాంతిభద్రతల పరిరక్షణలో లేదా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

## టీయూడబ్ల్యుజే సభ్యత్వానికి విశేష స్పందన



**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** మీడియా రంగంలోని 99 శాతం జర్నలిస్టులకు వృత్తి భద్రత కల్పిస్తూ జర్నలిజం విలువలను పరిరక్షించడంలో టీయూడబ్ల్యూజే ఐజేయు అగ్రభాగాన ఉంటుందని సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణ బంటు అన్నారు. ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలువురు జర్నలిస్టులకు సభ్యత్వం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా 33 జిల్లాలలో మెజార్టీ అక్రిడిటేసన్ కమిటీ సభ్యులు తమ యూనియన్ పక్షాన ఉన్నారని, వారందరూ కూడా అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్లు అందాలనే ఉద్దేశంతో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇప్పించడమే కాకుండా వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవడానికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే ఐజేయు ఎలక్ట్రానిక్ మీడియా సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బత్తుల మల్లికార్జున్, జిల్లా నాయకులు పులుసు నాగరాజు గౌడ్, తండు వెంకన్న గౌడ్, కందుకూరి యాదగిరి, షేక్ రషీద్, రామకృష్ణ, దుస్స చంద్రశేఖర్, గుంటి శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు వల్లపట్ల రవి, సాంబ చారి, అనంతుల శ్రీనివాస్ గౌడ్, చెరుకు శ్రీనివాస్, గుండేటి సత్యనారాయణ, దేసోజు రవి, తప్పీ అనిల్ కుమార్, మధు తదితరులకు సభ్యత్వం అందజేశారు.

## అమ్మవారికి సహస్ర కుంకుమార్చన



స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## పెంచిన ధరలు తగ్గించాలని ఆందోళన




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ , డీజిల్, గ్యాస్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ ఖమ్మం నగరంలో ఐఎన్టియూసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయం నుండి ర్యాలీ గా బయలుదేరి మయూరి సెంటర్ కు చేరుకున్నారు. పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లకు నిరసనగా ఆటోని తాళ్లతో లాగుతూ నిరసన తెలిపారు, గ్యాస్ సిలిండర్ ను మహిళలు నెత్తినపెట్టుకొని ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత 15 ఏండ్లలో ఎన్నోసార్లు పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచి అంబానీ,అదానీలకు అనుగుణం గా పేద ప్రజల నడ్డివిరిచే ప్రయత్నం చేశారని మండిపడ్డారు వెంటనే కేంద్రం పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారం తగ్గించాలని లేని పక్షాన నిరసనలను ఉదృతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఐఎన్ టియూసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు, నగర అధ్యక్షులు నరేష్ మోహన నాయుడు, మోటార్ రంగ జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, ఆటో జిల్లా నగర సంఘాల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి , తోట సైదులు, ఫజల్ , సిద్దాల నగేష్ , జనార్దన చారి , మెహరాజ్, బొడ్డు ఉపేందర్ , రవీ , బాణాల లక్ష్మణ్ , సెక్రటరీ పోతగాని రమణ , మహిళా కాంగ్రెస్ నాయకురాలు ప్రతిభ రెడ్డి , సుగుణ , పాలకుర్తి నాగేశ్వరరావు , ఫరీద్ ఖాద్రి,జోగారావు, ఉమారావు, దామా స్వరూప,బలుసు లక్ష్మీ పాల్గొన్నారు.

## పేదలను కాదని సంపన్నులకిస్తారా?

- ఎన్నెస్పి ఆక్రమణలను తొలగించకుంటే ఆందోళన
- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నిలువ నీడ లేక ఎన్నెస్పి కాలువ కట్టలపై గుడిసెలు వేసుకుంటే బలవంతంగా తొలగించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు సంపన్నులు అక్రమిస్తే ఎందుకు స్పందించడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. పేదలకు ఒక రీతి, సంపన్నులకు మరో రీతిగా వ్యవహరించాలని చట్టంలో రాసి ఉందా అని అలా ఉంటే అధికారులు వెంటనే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్నెస్పి స్థలాల ఆక్రమిత ప్రాంతాలలో –సిపిఐ బృందం పర్యటించింది. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రదేశాల్లో యధేచ్చగా నిర్మాణాలు జరుగుతుండటాన్ని పరిశీలించారు. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, రాజకీయ నాయకులే ఈ ఆక్రమణ దారుల్లో ఉన్నారని సురేష్ తెలిపారు. పేదల గుడిసెలను తొలగించేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్దాక్షణ్యంగా ఎన్నెస్పి కాలువ కట్టలపై పేదల గుడిసెలను తొలగింపజేసిన రాజకీయ నాయకులే ఇప్పుడు స్థలాలను ఆక్రమించి షెడ్లు వేయడం శోచనీయమన్నారు. ఎన్నెస్పి మేజర్ 2లో 66 అడుగుల వెడల్పున నాగార్జున సాగర్ కాలువ ఉన్నట్లు అధికారులు ధృవీకరించారని 12వ డివిజన్లో అష్టలక్ష్మి దేవాలయం ముందు భాగంలో ఓ వ్యాపారితో మొదలైన ఆక్రమణ గొల్లగూడెం రోడ్డు వెంబడి యధేచ్చగా సాగుతుందన్నారు. ఇప్పటికే కొందరు తమ నిర్మాణాలను పూర్తి చేయగా మరి కొందరు గతంలో ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్ లను తొలగించి ఆక్రమణలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే ఇది జరుగుతుందని ఇందులో కొందరు కేవలం స్థలాల ఆక్రమణ కోసమే పార్టీలు మారారని సురేష్ ఆరోపించారు. పేదల గుడిసెలను తొలగించి గ్రీన్బెల్ట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయకపోగా ఆక్రమణలను పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే తిరిగి పేదల చేత ఈ స్థలాలను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేస్తామని సురేష్ హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన కొందరి ప్రోద్బలమే ఈ ఆక్రమణలకు కారణమని ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయాన్ని గుర్తెరిగి తగు చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు. పరిశీలన బృందంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ నాయకులు ఉపేందర్, నర్సింహారావు, సైదులు, మదూరి శ్రీను తదితరులు ఉన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర, ఆత్మకూర్(ఎం) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించడం లో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఓపికి రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని, రోగులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు సంబధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారని,పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందరూ రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొని, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ నెలలో పీహెచ్‌సీలో ఎన్ని ప్రసవాలు జరిగాయనీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్ని డెలివరీలు నమోదయ్యాయనీ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు మరింత పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి, ప్రజల్లో ప్రభుత్వ దవాఖానలపై విశ్వాసం పెంచాలని అన్నారు.ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) రోగులను ఎలా ట్రాక్ చేస్తున్నారనీ అడిగి తెలుసుకున్నారు. షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నిరంతరం ఫాలోఅప్ నిర్వహించాలని సూచించారు.ప్రతి నెల పీహెచ్‌సీల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామని, అందులో సిబ్బంది పనితీరుకు రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత వైద్య సిబ్బందిపైనే ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందేలా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, డాక్టర్లు, సిబ్బంది, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల సవరణలో శాస్త్రీయత లోపించింది




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కార్మికుల కనీస వేతనాల సవరణ జీవోలలో తీవ్రమైన శాస్త్రీయత లోపించిందని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాకుండా కార్మికులను వంచించేలా ఈ సవరణలు ఉన్నాయని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ జె. మల్లికార్జున్ తీవ్రంగా విమర్శించారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల రెండవ రోజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కార్మికులది గణనీయమైన వాటా అని ,సంపద సృష్టిక ర్తలు అయిన కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని యజమానులే సంప ద సృష్టికర్తలు అని భావిస్తున్నాయని విమర్శించారు. ఈ క్లాసులకు ప్రిన్సిపాల్ గా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ గా జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి వ్యవహరించగా ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు, మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, సుబ్బూరు సత్యనారాయణ, గొరిగె సోములు, సిలివేరు రామకుమారి, చెక్క రమేష్,పైళ్ల గణపతి రెడ్డి, పొట్ట యాదమ్మ, జిల్లా కమిటి సభ్యులు ఆదిమూలం నందీశ్వర్,గంధమల్ల మాతయ్య,పోతరాజు జహంగీర్,మంచాల మధు,చిమకండ్ల శ్రీరాములు, కసగాని లలిత, జంగయ్య జిల్లా నాయకులు కొల్లూరు ఆంజనేయులు,తూటి వెంకటేష్, బండారు శ్రావణ్, యాదగిరి , సీస శ్రీను, శ్రీధర్,సిద్దులు,నవీన్ రెడ్డి , లక్ష్మణ్ , ఈశ్వర్,జంగమ్మ వసంత పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న జరుపుకొనే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులు సమన్వయంతో పని చేయాల్సిందిగా సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి,కలెక్టరేట్ ఏవో అంజి రెడ్డి, మునిసిపల్ కమిషనర్ లు, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రేపు కాంగ్రెస్ నేత జావెద్ సంస్మరణ సభ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మహ్మద్ జావెద్ సంస్మరణ సభ ఆదివారం ఉదయం 11.00 గంటలకు ఖమ్మంలోని రెడ్ హిల్స్ కాలనీలో జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏ ఐ సి సి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , టి పి సి సీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ , మట్టా రాగమయి, కార్పొరేషన్ చైర్మన్ లు తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారని వివరించారు. కాంగ్రెస్ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 30.05.2026
www.mudranews.in | @mudranews

8 పశ్చిమ తెలంగాణ
మెదక్, నిజామాబాద్
Medak, Nizamabad

**అశ్వగంధం:**



జ్ఞాపకశక్తి, మెదడు పనితీరు మెరుగుదల ఇది మెదడు కణాల క్షీణతను అరికట్టి జ్ఞాపక శక్తిని, ఏకాగ్రతను మెరుగుపరచడానికి దోహదం చేస్తుంది. వయసుతో పాటు వచ్చే మతిమరుపు వంటి సమస్యల తీవ్రతను తగ్గిస్తుంది.

# 'ఇందిరా' భవనాలను త్వరగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో గాంధీ నగర్ లో తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన సముదాయ పనులను శుక్రవారం కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 5 కోట్లతో మంజూరై ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టి తుది దశకు చేరుకుందని ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. మహిళల శిక్షణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనాన్ని ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. పిఆర్ ఈఈ నర్సింలు ఉన్నారు.

**2,97,719 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు..**

జిల్లాలో ఇప్పటి వరకు 63,869 రైతుల నుండి 2,97,719.360 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 45,458 మంది రైతులకు 490.87 కోట్ల రూపాయలు ఖాతాలలో జమ చేయడం జరిగిందని, 35 కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు పూర్తవడంతో మూసివేశామన్నారు.

**వేడుకలను ఘనంగా నిర్వహించాలి..**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి పరిశీలించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేయాల్సిందిగా సూచించారు.

తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ఉదయం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా.. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట కలెక్టరేట్ కార్యాలయ ఏఓ యూనస్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 5న ఇందిరా పార్క్ వద్ద ధర్నా




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జూన్ 5న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ర్యాలీ, మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటి సభ్యులు లింగారెడ్డి ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విద్యా పరిరక్షణ కమిటి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సుంచు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కిష్టయ్యలతో ధర్నా పోస్టర్లు, కరపత్రా లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటి నాయకులు గాడిపల్లి తిరుపతి రెడ్డి, విజయేందర్ రెడ్డి, కిష్టయ్య, తిరుపతి రెడ్డి, కనకయ్య, శ్రీకాంత్ తదితరులులు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల విద్యారంగం సంక్షోభంలోకి వెళుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం 2020 రాష్ట్రంలో అమలు చేయవద్దని కోరారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాపనను నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ బాధ్యులు తిరుపతి, శ్రీనివాస్, కనకయ్య ,శ్రీనివాస్, డీటీఎఫ్ బాధ్యు లు రాజిరెడ్డి, చంద్రబాను, ప్రభాకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మల్లయ్య సత్యనారాయణ, సత్తయ్య, నర్సింలు పాల్గొన్నారు.

## అయిలాపూర్‌లో బడిబాట

**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని అయిలాపూర్‌లో శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల వద్దకు ఉపాధ్యాయులు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ప్రీ–ప్రైమరీ (ఎల్.కె.జి, యు.కె.జి) తరగతులు అందుబాటులోకి వచ్చాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ రాజయ్య, సి.ఆర్.పి సత్యనారాయణ పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 'వ్యవసాయ మహాసభలను' జయప్రదం చేయండి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సమవేశం సిద్దిపేట జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవనంలో జిల్లా అధ్యక్షులు మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు . ఈ సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి హామీ రక్షణ కోసం ఉపాధి కూలీల, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం కోసం, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, స్థానిక సమస్యల పైన పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమస్తోందన్నారు. పోరాటాల ద్వారా అనేక విజయాలు సాధించి కూలీలకు అండగా నిలబడుతుందని ఈ నేపథ్యంలో భవిష్యత్తులో గ్రామీణ పేదలకు సమస్యల పరిష్కారం కోసం మహాసభలలో చర్చిస్తామన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుండి అన్ని మండలాల మహాసభలు పూర్తిచేసుకుని పదవ తేదీన జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ మహాసభలలో క్షేత్రస్థాయి నుండి వ్యవసాయ కార్మికులు పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా పథకం పేరు మార్చి బీబీజీ రాంజీ పేరుతో బడ్జెట్లో కేటాయింపులు తగ్గించి ఉపాధిని పేదలకు దూరం చేసే విధానాలను తీసుకొస్తుందని, ఉదయం సాయంత్రం ఫోటోలు అప్లోడ్ చేయడం, సాంకేతిక సమస్యలతో హాజరు పడకపోవడం, నెలలు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉండటం, పని దినాలు పెంచక పోవడం అనేక ఇబ్బందుల గురి చేస్తూ కూలీలలు ఉపాదానికి దూరం చేసే కుట్ర లు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలుగా ఉన్న వ్యవసాయ కూలీలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక అర్హులైన వారందరికీ కూడా పెన్షన్లు అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికు లకు 12 వేల రూపాయలు ఇస్తామని అనేక రకాల హామీలు ఇచ్చి పేదలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో వ్యవసాయ కార్మికులకు అండగా బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, తాటోజు రవీంద్ర చారి, శాతరాశి శ్రీనివాస్,పొట్టేల స్వామి, గజబింకర్ బాలకిషన్, పందుగ బాలమని, కంపె ఎల్లం, ఉల్లంపల్లి సాయిలు, బోనగిరి లింగం, రవీందర్ పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన టీఆర్ఎస్ జెండా



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** గ్రామ గ్రామాన టీఆర్ఎస్ జెండా డా పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకులు లోక రవిచంద్ర తెలిపారు. పార్టీ జెండా పండుగ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ కొట్టాల యాదగిరి, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జీలు మల్లారెడ్డి, గ్యాదరి గిరి, నియోజకవర్గ పరిశీలకులు కంచర్ల శివారెడ్డితో కలిసి సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ వాదాన్ని వదిలి ఫక్తు రాజకీయ పార్టీగా మారడం వల్లే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆవిర్భవించిందన్నారు. తన పార్టీ పేరులోని "తెలంగాణ" పదాన్ని తొలగించడం వల్ల తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడేందుకే కల్వకుంట్ల కవిత ఇంటిపార్టీని ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. తెలంగాణలో కొత్త రాజకీయ ఒరవడి తీసుకురావాలనే లక్ష్యంతో కవిత ఈ పార్టీని స్థాపించారని రవిచంద్ర పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావానికి వేల మంది ప్రజ లు ఆశీర్వదించారని తెలిపారు.

జూన్ మొదటి వారంలో సిద్దిపేటలో భారీ స్థాయిలో టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వ హించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ కూడా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వలసవాదుల ప్రయోజనాల కోసం పాలన సాగిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులందరినీ ఏకం చేసే దిశగా టీఆర్ఎస్ పార్టీ పనిచేస్తోందని పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలో జరిగే జండా పండుగ కార్యక్ర మంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

**నియోజకవర్గ సమీక్ష..**

తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ నిర్వహణపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గంలో జూన్ 20 లోగా గ్రామగ్రామాన టీఆర్ఎస్ జెండాలు ఎగరేయడానికి తీసుకోవలసిన చర్యలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జూన్ మొదటి వారంలో సిద్దిపేట పట్టణంలో పార్టీ జెండా ఆవిష్కరణకు అధినేత్రి హాజరయ్యే కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించారు. నాయకులు గౌస్ మోయినొద్దిన్, కమలాకర్ పాల్గొన్నారు.

## బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే




**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెప్మా ఆధ్వర్యంలో మెదక్ పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4.30 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావుఅందజేశారు. ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, శివ రామకృష్ణ, అశోక్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ ..**

పాపన్నపేట మండలంలోని కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ కింద మొత్తం 104 చెక్కులను మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ పంపిణీ చేశారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించి, వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపే లక్ష్యంతో ఈ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల లబ్ధి చేకూరేలా చూస్తామని పేర్కొన్నారు.

## ఇంటర్నెట్ కు ఆటంకం కలగొద్దు




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** జిల్లాలో ఇంటర్నెట్ వినియోగదారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నెట్ వర్క్ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్షీ కిరణ్ ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో డిస్ట్రిక్ట్ లెవెల్ టెలికాం కమ్యూనికేషన్ కమిటీ సమావేశం అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని టెలికాం కంపెనీలు ఎక్కడైనా నెట్ వర్క్ సమస్యలు ఎదురైన, సేల్ టవర్ల నుండి సిగ్నల్ అంతరాయం, సాంకేతిక సమస్యలు తలెత్తిన రిపేర్లు చేసే ముందు కాల్ బిఫోర్ యూ బిగ్ –యాప్ లో సమస్య అప్లోడ్ చేస్తే స్థానిక అధికారులందరికీ సమాచారం చేరుతుందని తద్వారా నెట్ వర్క్ సేవల అంతరాయం గూర్చి ప్రజలకు ముందుగానే సమాచారాన్ని చేరవేస్తారని తెలిపారు.టెలికాం కంపెనీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో పని చేసి నెట్ వర్క్ సమస్యలు తలెత్తకుండా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఇ వెంకటరెడ్డి, జిల్లా ఇండస్ట్రియల్ అధికారి గణేష్ రామ్, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, విద్యుత్ శాఖ ఎస్ఇ, మున్సిపల్ కమిషనర్లు, టెలికాం కంపెనీలు ప్రతినిధులు టి ఫైబర్, బిఎస్ఎన్ఎల్, జియో, ఇండస్ టవర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది




**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను హామీల పేరుతో మభ్యపెట్టి మోసం చేసిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటను కేంద్ర ప్రభుత్వం కొంటేనే.. తాము కొంటామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాకులు చెప్తుందని విమర్శించారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు రైతులను పట్టించుకోవట్లేదన్నారు. భాజపా ప్రభుత్వం సైతం యుద్ధం పేరుతో పెట్రోల్, డీజిల్ రేట్లు ఒకేసారి పెంచి సామాన్యులపై భారం మోపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, దాపేందర్ రాజు, వీజీ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బన్సీ పటేల్, కృష్ణ పటేల్, హన్మండ్లు, విజయ్, రవి పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6–3–569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com